క్లుప్తంగా

యోగాతో శారీరక సామర్థ్యం


యోగాసనాలు చేస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు, సిబ్బంది

కొండపి: యోగా శారీరక సామర్థ్యాన్ని పెంచుతుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. యోగాంధ్రాలో భాగంగా గురువారం మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యోగ శిక్షకుడిగా హైస్కూల్ పీడీ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు జరిగాయి. ఏప్రిల్ 28వ తేది నుంచి ఈ నెల 5వ తేది వరకు 40 రోజుల పాటు జరిగిన శిబిరంలో చిన్నారులు ప్రతిరోజు పుస్తక పఠనం చేశారు. చివరి రోజు వీరికి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకురాలు లక్ష్మీనర్సమ్మ వివరించారు.

సచివాలయం, రైతు సేవాకేంద్రం, హెల్త్ క్లినిక్ ప్రారంభం

పామూరు: మండలంలోని దూబగుంట్లలో నిర్మించిన గ్రామసచివాలయం, రైతుసేవాకేంద్రం, హెల్త్‌క్లినిక్, రూ.3.10 కోట్లతో నిర్మించిన రోడ్డును స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఇర్రి కోటిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా హనుమంతరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

పీసీపల్లి: ఎంపీడీఓగా హనుమంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు అన్నివేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. బాధ్యతలను స్వీకరించిన ఆయన్ను డిప్యూటీ ఎంపీడీఓలు ప్రసాద్, రెహమాన్, మల్లేశ్వరి, నారాయణ తదితరులు కలిశారు.

11 నుంచి పోలేరమ్మ తల్లి వార్షిక తిరునాళ్లు


కామేపల్లి పోలేరమ్మతల్లి ఆలయం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లిలో ప్రసిద్ధి చెందిన పోలేరమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 11వ తేది బుధవారం నుంచి 13 వ తేదీ వరకు వార్షిక తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బైరాగి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేది అమ్మవారికి సింహవాహన సేవ, 12 వతేది విశేష అలంకరణ, విద్యుత్ ప్రభలు, 13వ తేది పోలేరమ్మ తల్లికి పాలపొంగళ్ల సమర్పణ కార్యక్రమాలు జరపనున్నట్లు ఆయన వివరించారు. తిరనాళ్ల సందర్భంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బైరాగి వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: కందుకూరు టౌన్ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించే పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు. పట్టణంలోని గణేష్‌నగర్, కేసరిగుంటకాలనీ, గాయత్రీనగర్, కందుకూరు ఎమ్మెల్యే కార్యాలయం ప్రాంతం, కుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరురోడ్డు బస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 6.00 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11కేవీ పలుకూరు ఫీడర్ లైన్‌కు తగిలే చెట్ల కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ టీవీ.నరసింహం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న పలుకూరు పంచాయతీలోని గ్రామాల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

మండుటెండలో పనులు..

పస్తుల్లో కూలీలు..


పొన్నలూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు


టెంట్లు లేకపోవడంతో ఎండతీవ్రతకు చెట్టు కింద సేదతీరుతున్న ఉపాధి కూలీలు

- మూడు నెలలకు పైగా వేతనాలకు ఎదురు చూస్తున్న ఉపాధి కూలీలు
- వేతనాలు అందకా కుటుంబ నిర్వహణ భారంగా ఉందని ఆవేదన
- గత ప్రభుత్వంలో రెండు వారాల్లోనే ఉపాధి వేతనాలు చెల్లింపు
- నేడు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

పొన్నలూరు:

ఉపాధి హామీ కూలీలకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. సకాలంలో వేతనాలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సుమారుగా వంద రోజులకు పైగా చేసిన పనికి వేతనాలు అందక ఉపాధి కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలో మాడిపోతు రెక్కలు ముక్కలు చేసుకుని ఉపాధి పనులు చేస్తున్నా..వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

రూ.26 కోట్ల బకాయిలు

పొన్నలూరు మండలంలో 11430 జాబ్ కార్డుదారులున్నారు. అలాగే 80కి పైగా గ్రూపులు ద్వారా పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి రూ.3.56 కోట్ల నిధులు ఇప్పటి వరకు ఖర్చు చేశారు. ఈ ఖర్చు చేసిన నిధులన్నీ కూడా వేతనాల రూపంలో శ్రామికులకు చెల్లించాల్సి ఉంది. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారుగా రూ.26 కోట్లకు పైగా ఉపాధి శ్రామికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీంతో గ్రామాల్లోని ఉపాధి శ్రామికులు మూడు నెలలుగా నిత్యం ఉపాధి కార్యాలయాలు, బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే గతంలో తాము చేసిన పనులకు ఇచ్చిన స్లిప్‌లు కూడా ప్రస్తుతం ఇవ్వకపోవటంతో తాము మూడు నెలలుగా ఎంత పని చేసామో, ఎంత వేతనం వస్తుందో తెలియని పరిస్థితి అని వేతనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి పనులే ఆధారం...

నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ ఉంటాయి. దీంతో 60 శాతం మందికి పైగా ప్రజలు ఉపాధి పనులపై ఆధారపడుతుంటారు. ప్రతి మండలంలో వేల సంఖ్యలో ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరంతా మూడు నెలలుగా గ్రామాల్లో ఉపాధి పనులకు పోతున్నారు. చెరువులు, ముఖ్యమైన కుంటలు, వాగులు, చెక్ డ్యాంల్లో పూడిక తీత పనులు, చెట్లు తొలగింపు, ఫారం పాండ్లు వంటి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్నారు. అయితే చేసిన పనులకు వేతనాలు చెల్లించకపోవడంతో కోట్లల్లో ఉపాధి బకాయిలు పేరుకుపోయాయి. అలాగే సకాలంలో ఉపాధి వేతనాలు ఖాతాలకు జమకాకపోవడం వలన పల్లెల్లో కుటుంబ పోషణ కూడా జరగకా అప్పులు చేస్తున్నారు.

మండుటెండలో పనులు..

వాస్తవంగా ఉపాధి కూలీలు పనులు చేసే చోటే వారు మధ్యలో విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయాలి. కానీ వీటి జాడ ఎక్కడా కనిపించడం లేదు. అలాగే పనిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఏదైనా గాయాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే అందిచాల్సిన వైద్య సేవలకు సంబంధించిన ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పనివేళలు ఉదయం 8 నుంచి 11 గంటల లోపు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిర్దేశించారు. అయితే ఈ సమయంలో కూడా సూర్యుడు తన ప్రతాపం చూపడంతో 50 ఏళ్ల దాటిన ఉపాధి కూలీలు అనారోగ్యానికి గురవుతున్నారు.

రెండు వారాల లోపే వేతనాలు చెల్లింపు....

గత ప్రభుత్వంలో ఉపాధి పనులు చేసిన వారికి రెండు వారాల లోపే వేతనాలు చెల్లించే వారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేదు. వేతనాలు ఎప్పుడు ఇస్తారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉపాధి వేతనం రూ.307గా ప్రకటించారు. అయితే ఎక్కడా కూడా కనీస వేతనం ఇస్తున్న దాఖలాలు లేవని ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి ఉపాధి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

వేతనాలు రాకపోతే ఎలా బతకాలి:



ఉపాధి శ్రామికులకు నెలలు తరబడి వేతనాలు అందడం లేదు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో పేదవారికి కుటుంబ పోషణ భారంగా మారింది. కనీసం అనారోగ్యంతో ఉన్న వారు మందులు తెచ్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రెండు వారాల లోపే ఉపాధి వేతనాలు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం స్పందించి త్వరగా ఉపాధి వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి,
వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, పొన్నలూరు

త్వరలో ఉపాధి వేతనాలు చెల్లిస్తాం:

జిల్లాలో ఉపాధి కూలీలకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించాల్సిన మాట వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా వేతనాలు విడుదల కాలేదు. గత ఏప్రిల్ నెలలో రూ. 5 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. త్వరలో ఉపాధి వేతనాలు విడుదలవుతాయి. ఉపాధి కూలీల ఖాతాలకు జమ చేస్తాం.

జోసఫ్ కుమార్, డ్వామా పీడీ,
ఒంగోలు

గోళ్లమూడికి నివాళులర్పించిన బత్తుల


గోళ్లమూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బత్తుల

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గోళ్లమూడి సుందరరామిరెడ్డి చిత్రపటానికి పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి నివాళులు అర్పించారు. మండలంలోని పాకల పంచాయతీలోని ఆయన నివాసంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో గురువారం బత్తుల పాల్గొన్నారు. సుందరరామిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కొనియాడారు. ఆయన కుమారులు ఎంపీటీసీ అశోక్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, కోమట్ల వెంకారెడ్డి, మాదాల శంకర్, పాకనాటి రమణారెడ్డి, వాయిల పున్నయ్య, వాయిల తాతయ్య, పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోజు రోజుకు తగ్గుతున్న ధరలు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కనిష్ట ధర కేజీ రూ.185 పలకగా ,గురువారం నిర్వహించిన వేలంలో మరో రూ.5 తగ్గి 180 పలికింది. పొగాకు ధరలు పెరిగితే తమ పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు అనుకుంటుంటే ధరలు ఏమో రోజు రోజుకి తగ్గుతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ 180 పలికిందని ఇంచార్జ్ వేలం నిర్వహణ అధికారి ఎం. సత్య శ్రీనివాస్ తెలిపారు.క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 705 బేళ్లను తీసుకురాగా 527 బేళ్లు కొనుగోలు చేశారు. వ్యాపారుల వివిధ కారణాలతో 178 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.251.01గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.190 పలికిందని వేలం నిర్వహణాధికారి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 701 బేళ్ల వేలానికి తీసుకురాగా 537 బేళ్లను కొనుగోలు చేసి 164 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.241.28గా నమోదైంది. వేలంలో 13 కంపెనీలు పాల్గొన్నాయి.

పైప్‌లైన్ పగిలినా పట్టించుకోరా..?


కెనరాబ్యాంకు సమీపంలో మంచినీటి పైపు లీకు కారణంగా రోడ్డుపై పారుతున్న నీరు

సింగరాయకొండ: మండల కేంద్రంలో కెనరా బ్యాంకు సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి పక్కన రోడ్డు మార్జిన్లో రక్షిత మంచినీటి పథకం పైపులైను పగిలి మంచినీరు వృథాగా పోతోంది. పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో మంచినీటి పైపు లీక్ అవడంతో నీటి సరఫరా అయ్యే సమయంలో పైపు నుంచి నీరు లీకై రోడ్డుపై పారి ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతోందని, ఈ విషయమై నాలుగునెలలుగా సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదంటున్నారు. పైపు లీకేజీ కారణంగా మురుగునీరు పైపుల ద్వారా సరఫరా అయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మంచినీటి పైపు లైనుకు మరమ్మతులు చేసి కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


హనుమంతునిపాడులో మొక్కలు నాటుతున్న అధికారులు


సింగరాయకొండలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ జయమణి


కొండపిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఎంఈఓ


కనిగిరిలో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ, చైర్మన్


జరుగుమల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

కనిగిరిరూరల్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్, మెప్మా, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలో పలు చోట్ల గురువారం ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్ మొక్కలు నాటారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, పులి శ్రీను, శానటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, మెప్మాటీఎంసీ రఘు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నవకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో డీఎం మహ్మద్ సయానా బేగం మొక్కలు నాటారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. గ్రంథపాలకుడు ఎస్‌కే షరీఫ్ అహమ్మద్, జేవీవీ నాయకులు ఎస్‌కే గయాజ్, ఖాజా రెహ్మాన్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కొండపి: ప్రపంచ పర్యావణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రామాంజనేయులు మొక్కలు నాటారు. ఎంఈఓ-2 రామారావు, సిబ్బంది పాల్గొన్నారు. మొక్కల నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

సింగరాయకొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. సాధనిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం మొక్కలు నాటారు. మండలంలో 2,500 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎస్సై బి.మహేంద్ర, ఏపీఓ సుభాషిణి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు, ఆర్ఐ చైతన్య, ఏపీఓ వినయ్, వీఆర్‌ఓలు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పామూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని లక్ష్మీనరసాపురం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉగ్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం జోసఫ్ కుమార్, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఏపీఓ మాల్యాద్రి, పువ్వాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం ఏపీఓ సుధాకరరావు మొక్కలు నాటారు. ఈఓఆర్డీ నాగేశ్వరరావు, ఈసీ కోటేశ్వరరావు, టీఏలు రవి, అనిల్, కొండయ్య, కుమార్ పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రమణమూర్తి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలంలో 5 వేల మొక్కలు నాటుతామన్నారు. ఈఓఈఆర్డీ ఏడుకొండలు, ఏపీఓ ఎం రత్నజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పలువురికి నేతల నివాళి


కొండారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జెడ్డు కృష్ణారెడ్డి తండ్రి కొండారెడ్డి అనారోగ్యంతో, పొన్నలూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు వలేటి రామారావు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. దీంతో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి గురువారం ఇరువురి మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మాజీ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదాం



మాట్లాడుతున్న న్యాయవాదులు

కనిగిరిరూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదాం అని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జానీ షాహిద్, పాశం పిచ్చయ్య మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను గురించి ప్రజలకు వివరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు గంథం శ్యామ్యూల్ గెర్షోమ్, నవకుమార్, రాజేష్, న్యాయ సేవాధికా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల నివారణతో మంచి దిగుబడి

- సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు


మొక్కలు నాటుతున్న సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు

ఉలవపాడు: పురుగుల నివారణతో పంటల్లో మంచి దిగుబడి సాధించవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి జి.ప్రసాద్‌బాబు అన్నారు. మండల పరిధిలోని భీమవరం, రాజుపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో మామిడి, సపోట, వరి పంటలు పండిస్తున్నారన్నారు. ఈ పంటలలో పురుగుల నివారణ చాలా ముఖ్యమని తెలిపారు. మామిడిలో పండుఈగ, తామర పురుగుల సమస్య అధికంగా ఉందన్నారు. వాటి నివారణ మార్గాలను తెలియచేశారు. ఎకరాకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు అడుగుల ఎత్తులో ఈ బుట్టలు ఏర్పాటుచేయడం వలన ఈగలు వాటికి ఆకర్షించబడి డబ్బాలో పడి చనిపోతాయన్నారు. కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు తొడగాలని తెలిపారు. మిరపలో యల్‌సీఏ643 రకం విడుదల అయిందని, ఇది తెగుళ్లను బాగా సమర్థవంతంగా తట్టుకుంటుందని ఎకరాకు 25నుండి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త అనురాధ మాట్లాడుతూ డ్రోన్‌దీదీ పథకం కింద స్వయం సహాయక సంఘ మహిళలకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్ తీసుకుని అద్దెకు పిచికారీ చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కోళ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సంతోష్ మాట్లాడుతూ రైతులు వాణిజ్య సరళిలో కోళ్ల, పొట్టేళ్ల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులకు వివిధ పంటల్ల ఉత్తమ యాజమాన్య పద్ధతులపై కేంద్రప్రభుత్వ పథకాలపై తయారుచేసిన పుస్తకాలను అందించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కందుకూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పామూరు రోడ్డు కూడలిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేపట్టారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ వాడకం వల్ల భూమి వేడెక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, అటవీశాఖ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి మళ్లీ అవకాశం

ఉలవపాడు: వీరేపల్లిలోని మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మళ్లీ అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 5 నుండి 20 వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో దరఖాస్తు చేయని విద్యార్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కమిషనర్ కల్పించినట్లు తెలిపారు. 7,8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఈ పోటీలు జరిపారు. ముందుగా విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. నీతికథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. 35 రోజులపాటు జరిగిన ఈ వేసవి శిక్షణా శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయానికి పిల్లలను పంపిన తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.